క్లుప్తంగా

వాసవి హాస్టల్ ట్రస్ట్ చైర్మన్‌గా రాజమౌళి గుప్తా



కవాడిగూడ: ముషీరాబాద్ వాసవి హాస్టల్ ట్రస్ట్ చైర్మన్‌గా గంగి రాజమౌళి గుప్తాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా బోగారపు దయానంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాష్ట్ర టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ముషీరాబాద్‌లో ఆర్యవైశ్య హాస్టల్‌లో జరిగిన సమావేశంలో ముషీరాబాద్ వాసవి హాస్టల్ ట్రస్ట్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

బీజేపీకి ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాజీనామా

అంబర్‌పేట: బీజేపీ బాగ్‌అంబర్‌పేట్ డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కిశోర్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గత 14 ఏళ్లుగా పార్టీలో తాను పలు బాధ్యతలు నిర్వహించానని తగిన గుర్తింపు లేకే రాజీనామా చేస్తున్నట్లు ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలకు పంపినట్లు వివరించారు. భవిష్యత్తులో ఏ పార్టీలో చేరబోయేది త్వరలో ప్రకటిస్తానని పేర్కొన్నారు.

ఇఫ్తార్ విందుతో ఐక్యత



పటేల్‌నగర్‌లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక అని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం రాత్రి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు షానూర్ ఆధ్వర్యంలో పటేల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇఫ్తార్‌లు ఐక్యమత్యాన్ని చాటి చెబుతాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు లవంగం ఆంజనేయులు, జాఫర్, ఆదీల్, రఫిక్, మోసిన్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

డయగ్నోస్టిక్ వార్షికోత్సవం



నల్లకుంట: నల్లకుంటలోని ఐరా డయగ్నోస్టిక్ సెంటర్ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బాగ్ అంబర్‌పేట్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని వ్యాధి నిర్ధారణ పరీక్షల ధరలు అందుబాటులో ఉండేలా చూడాలని యాజమాన్యానికి సూచించారు. వ్యాపార దృక్పథంతో కాకుండా పేదలకు అవసరమైన సేవలను అందిస్తామని సెంటర్ నిర్వాహకులు డాక్టర్ హరీష్, సందీప్, చంద్రకాంత్ వివరించారు.

రంజాన్ కానుకల పంపిణీ

కవాడిగూడ: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్ అఖిల బాబా దర్గా వద్ద ముస్లింలకు రంజాన్ కానులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు రంజాన్ కానుకల కిట్లను అందజేశారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అన్ని పండుగలను గొప్పగా నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాల మధ్య పండుగలను నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'బీజేపీతోనే అన్ని వర్గాలకు న్యాయం'

మలక్‌పేట: బీజేపీతోనే అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతోందని బీజేపీ నాయకులు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం మూసారంబాగ్‌లో సామాజిక న్యాయ వారోత్సవాలు నిర్వహించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి, కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, మహిళా మోర్చా ఇన్‌చార్జి సుభాష్‌చందర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా నాయకులు వైద్యులను, సిబ్బందిని, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులను సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

బీజేపీ ఓబీసీ మోర్చా బలోపేతానికి కృషి



కవాడిగూడలో 'పల్లెపల్లెకు ఓబీసీ, ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలె భాస్కర్

కవాడిగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతీ ఇంటికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఓబీసీ మోర్చా కార్యకర్తలు పనిచేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలె భాస్కర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓబీసీ మోర్చాను బలోపేతం చేయడానికి పలు కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా 'పల్లెపల్లెకు ఓబీసీ, ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమం చేపట్టామన్నారు. సోమవారం కవాడిగూడ డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్ష, కార్యదర్శులు చిత్రకుమార్‌గౌడ్, హరీష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో బండానగర్‌లో ఆలె భాస్కర్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షులు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ రచనశ్రీలు ముఖ్య అతిథులుగా హాజరై ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా ప్రతీ ఇంటికి వెళ్తున్నామన్నారు. ఓ వైపు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తూ.. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నామని పేర్కొన్నారు. ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు ఏఎస్‌చారి, శ్రీనివాస్‌ముదిరాజ్, గంట శ్రీనివాస్, నగర నాయకులు వెంకటేష్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ప్రభాకర్‌గంగపుత్ర, ఓబీసీ మోర్చా నేతలు రమేష్, దిలీప్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడి చేయాలి..



డాక్టర్ కె.లక్ష్మణ్‌తో సూర్యనారాయణశర్మ

ముషీరాబాద్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి బీజేపీ శ్రేణులు కష్టపడి పని చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పార్టీకి నాయకులు, కార్యకర్తలు ఎక్కువ సమయం కేటాయించి పార్టీ కార్యక్రమాల విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ సీనియర్ నాయకులు సూర్యనారాయణశర్మ గాంధీనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. పార్టీని బూత్‌స్థాయిలో ప్రతిష్టం చేసేందుకు దృష్టి సారించాలన్నారు. కేంద్రం పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు సాయశక్తుల కృషి చేస్తానని శర్మ స్పష్టం చేశారు.

కుటుంబపాలనపై ప్రధాని మాట్లాడటం శుభపరిణామం



మాట్లాడుతున్న తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

ముషీరాబాద్: సీఎం కేసీఆర్ కుటుంబ అవినీతి పాలనపై పోరాడేందుకు ప్రజల సహకారం కావాలని ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపును స్వాగతిస్తున్నామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అన్నారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య అవినీతి అని దానిని పునాదులతో పెకిలించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఎన్నికల్లో అధికార పార్టీ కొన్ని వేల కోట్లు చేస్తున్న ఖర్చు దేశమంతటా చర్చ జరుగుతుందన్నారు.

- కేంద్ర దర్యాప్తు సంస్థలు అవినీతిని నిర్మూలించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. 'ఇటీవల ఓ జర్నలిస్టుతో జరిగిన ముఖాముఖిలో సీఎం కేసీఆర్ తనను నాయకుడిగా చేస్తే ప్రతిపక్ష పార్లమెంటు అభ్యర్థుల ఖర్చును తానే భరిస్తానని' వాఖ్యానించారన్నారు.
- నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ప్రజలను తాగుబోతులుగా మారుస్తున్నారని విమర్శించారు.
- ప్రభుత్వ ఆస్తులను యద్ధేచ్ఛగా అమ్ముకుంటూ రాష్ట్రాన్ని, ప్రజలను రూ.5 లక్షల కోట్ల అప్పుల పాలు చేసి ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుధాకర్‌ముదిరాజ్, నందగోపాల్, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

'కంటివెలుగు'కు విశేష స్పందన



కార్యక్రమంలో పాల్గొన్న పలువురు జర్నలిస్టులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్టు (హెచ్‌యూజే), ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఎంహెచ్ భవన్‌లో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సుమారు 150 మంది జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకట్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ పద్మజ, కంటి వెలుగు ప్రోగ్రామ్ ఆఫీసర్ అశ్మితలు సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, జగదీష్‌లు మాట్లాడారు. పీహెచ్‌ఎన్ రామలక్ష్మి, డాక్టర్ శ్రీధర్, హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్, ట్రెజరర్ రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగవాణి, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్నయ్య, రాష్ట్ర నాయకులు పిల్లి రామచందర్, చంద్రశేఖర్, రఘు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తొలి తెలుగు కథా రచయిత్రి బండారు అచ్చమాంబ

చిక్కడపల్లి: తొలితెలుగు కథా రచయిత్రి బండారు అచ్చమాంబ అని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. సోమవారం త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ప్రముఖ కథా రచయిత్రి బండారు అచ్చమాంబ యాదిలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సాధారణ మధ్య తరగతి కుటుంబ జీవితాలను కథా వస్తువులుగా తీసుకుని ఆమె కథలు రాశారన్నారు. ప్రముఖ రచయిత్రి ముక్తేవి భారతి మాట్లాడుతూ.. నాటి పరిస్థితులు, మహిళల స్థితిగతులను తెలుసుకోవడానికి అచ్చమాంబ రచనలను తిరిగి ముద్రించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గానసభ అధ్యక్షులు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించగా.. ప్రముఖులు ఎస్సీ భారతి, గుండవరపు గీతాదేవి, బండి నాగజ్యోతి తదితరులున్నారు.

ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుదారులకు రాయితీ



డీసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య తదితరులు

అంబర్‌పేట: ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుదారులకు 5 శాతం రాయితీ అవకాశం కల్పిస్తున్నట్లు దానిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 డీఎంసీ వేణుగోపాల్ కోరారు. ఈ ఏడాదికి సంబంధించిన ఆస్తిపన్ను ముందస్తు చెల్లించే వారికి ఈనెల 30న చివరి గడువు ఉన్నట్లు ఆయన సోమవారం తెలిపారు. ఆస్తిపన్ను చెల్లింపుదారులు ముందుగా చెల్లించి 5 శాతం రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా అపార్ట్‌మెంట్లు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు మూకుమ్మడిగా పన్నులు చెల్లిస్తామంటే ప్రత్యేక సిబ్బంది బృందాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ముషీరాబాద్: జీహెచ్‌ఎంసీ ప్రవేశపెట్టిన 'ఎర్లీబర్డ్' స్కీమ్‌ను ఆస్తిపన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకుని 5 శాతం రాయితీ పొందాలని ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య సూచించారు. అడిక్‌మెట్ డివిజన్‌లో సోమవారం 'ఎర్లీబర్డ్' స్కీమ్‌పై ప్రజలలో అవగాహన కల్పించి వారి నుంచి ఆస్తి పన్నును సేకరించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. ఎర్లీ బర్డ్ స్కీమ్ ఈనెల 30 వరకు అమలులో ఉంటుందన్నారు. 2023–24 వార్షిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లించాలన్నారు. ఈ స్కీమ్‌లో చెల్లించిన వారికి 5 శాతం రాయితీ అవకాశం కల్పిస్తున్నామన్నారు. ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- ముషీరాబాద్ సర్కిల్‌లో 2023 మార్చి 31 వరకు రూ.42 కోట్ల టార్గెట్ ఇవ్వగా.. రూ.39 కోట్ల 32 లక్షలు వసూలైనట్లు ప్రకటించారు.
- 2022 ఆర్థిక సంవత్సరానికి రూ.38.48 కోట్లను టార్గెట్ ఉండగా.. రూ.29.56 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయన్నారు.
- గతేడాది రూ.29 కోట్ల వసూలుతో రూ.39.32 కోట్లకు తీసుకువచ్చామని కమిషనర్ తమకు ఇచ్చిన టార్గెట్‌లో రూ.93.62 శాతం వసూలు చేశామని వివరించారు. ఈ టార్గెట్‌ను చేరుకోవడంలో తమ సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

హిమాయత్‌నగర్: అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం వారికి జైలు శిక్ష విధించినట్లు అడిషినల్ సీపీ (క్రైం, ఉమెన్) ఎ.ఆర్.శ్రీనివాస్ తెలిపారు. వివరాలివీ... 24 ఏళ్ల యువకుడు తన క్లాస్‌మేట్ అయిన ఓ అమ్మాయిని పార్టీ ఉందంటూ ఇంటికి పిలిచి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. కూల్ డ్రింక్‌లో మత్తు పదార్థాలు కలిపి న్యూడ్ వీడియో తీశాడు. మరో యువకుడు పెళ్లి చేసుకుంటానంటూ యువతిని మభ్యపెట్టి శారీరకంగా గడిపాడు. ఆమె గర్భం దాల్చడంతో ట్యాబ్లెట్లతో గర్భాన్ని తొలగించేలా చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వారిని తాకరాని చోట తాకుతున్న ముగ్గురిని షీటీం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. వారిపై కేసులు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరు పరచగా న్యాయస్థానం వారికి జైలు శిక్ష విధించింది.

అభివృద్ధి పనులు ప్రారంభం



కమాన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని లంబాడి బస్తీలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పర్యటించారు. ఎమ్మెల్యే సొంత నిధులతో బస్తీ కమాన్ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. బస్తీలో ఎలాంటి సమస్యలున్నా.. నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. అధికారులను సంప్రదించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి, టెంపుల్ జనార్దన్, కల్యాణ్‌నాయక్, నితిన్, దేవేందర్, నారాయణ, బాలు, మున్నా తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షుడిగా శ్రీధర్



ముషీరాబాద్: అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ నీలా శ్రీధర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సమాఖ్య కేంద్ర కార్యనిర్వహక అధ్యక్షుడు రాజమౌళి గుప్తా, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా నియామకపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ దయానంద్, పురుషోత్తం, రాజశేఖర్‌గుప్తా, రమేష్ తదితరులు శ్రీధర్‌ను అభినందించారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఐదెకరాల స్థలం కేటాయించడం హర్షనీయమని ఆర్యవైశ్యులు రాజకీయ, విద్యా, ఉద్యోగరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

బండి సంజయ్‌తో 'బలగం'



నల్లకుంట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో ఆ పార్టీ నేతలు సోమవారం ఓ థియేటర్‌లో బలగం సినిమాను చూశారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ వనం రమేశ్, గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాణికేశ్వర్‌నగర్‌లో కొనసాగుతున్న రిలే దీక్షలు

లాలాపేట: చేయి చేయి కలుపుదాం హాస్పిటల్ నిర్మిద్దామంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నిరసన కార్యక్రమాలకు మద్దతుగా సోమవారం 6వ రోజు శ్రీరామ గండికోట వడ్డెర సంఘం నాయకులు దీక్ష చేపట్టారు. బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర నాయకులు రాంబాబు యాదవ్ దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్పిటల్ ఏర్పాటు అనేది బస్తీవాసుల న్యాయమైన డిమాండ్ అని ఈ విషయాన్ని త్వరలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సాయంత్రం డివిజన్ అధ్యక్షులు గండికోట విజయ్‌కుమార్, బోదాసు నర్సింహ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. గండికోట కిరణ్, గండికోట కుమార్, జి. రమేష్, జి. నర్సింహ, జి. కుమార్, యాదయ్య, లక్ష్మణ్, వెంకట్, శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బంది వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న ఎస్.ఎల్.పద్మ

ముషీరాబాద్: మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బంది జీతాలు పెంచి సకాలంలో చెల్లించాలని ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ హాస్టల్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ అన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న 175 మోడల్ స్కూల్ ఆంగ్ల మాధ్యమంతో నడుస్తున్న పాఠశాలలు, వీటి అనుబంధ హాస్టల్ సిబ్బంది సమస్యలపై విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బంది పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.

- హాస్టల్ విద్యార్థినులకు ఆసుపత్రి అవసరాలు ఏర్పడితే రవాణా సౌకర్యం లేదని దీనికోసం ఆటోని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
- సుమారు 100 మంది పనిచేసే సిబ్బందికి పని భారం పెరిగి, వేతనాలు సకాలంలో రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.
- కేజీబీవీ ఉద్యోగులతో సమానంగా జాబ్ చార్ట్‌ను ప్రకటించాలని, 24 గంటల పనిదినాన్ని మార్చు చేసి 8 గంటలు అమలు చేయాలన్నారు.
- మెటర్నిటీ లీవ్‌ను కొనసాగించడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈనెల 24న కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. అనంతరం నవ్య, యామిని, సుల్తానా, లలిత, అరుణ, భాగ్యమ్మ, మాధవి, లలితారాణి, రేణమ్మ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



తాగునీటిని అందిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి

నల్లకుంట: రోజురోజుకు వేసవితాపం పెరుగుతోందని బాటసారుల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి సతీమణి కావ్యరెడ్డి సూచించారు. సోమవారం నల్లకుంట చే నంబర్ రోడ్డులో బీజేపీ నాయకుడు అచ్చిని మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతం రావు, బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, కాచిగూడ, బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్ యాదవ్, పద్మావెంకట్‌రెడ్డి, నాయకుడు భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ముషీరాబాద్: ఇఫ్తార్ విందులు మతసామరస్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం పీఎస్ ప్రాంగణంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై పండ్లను తినిపించి విందును ప్రారంభించారు. సీఐ జహంగీర్‌యాదవ్ మాట్లాడుతూ.. రంజాన్ పవిత్రమైన మాసమని అందరూ.. భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, సయ్యద్ ముక్తార్ హుస్సేన్, అహ్మద్ షరీఫ్, ఏజాక్ హుస్సేన్, అలందార్ హుస్సేన్, రిజ్వాన్, ఎయిర్‌టెల్ రాజు, డీఐ ప్రశాంత్, ఎస్సైలు సురేందర్, శ్రీనివాస్, సందీప్‌రెడ్డి, స్వప్న, ఏఎస్సై ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లవెల్లి అంజిరెడ్డి తదితరులున్నారు.

శ్రీ వైష్ణవ ఆత్మ గౌరవ భవన శంకుస్థాపనకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్



హాజరైన చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం ఈసీ సభ్యులు

నల్లకుంట: చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం ఆత్మ గౌరవ భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం పీర్జాదిగూడలో ఎకరం స్థలాన్ని కేటాయించి, భవన నిర్మాణానికి కోటి రూపాయల నిధులకు కూడా మంజూరు చేసిందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే పదివేల మందితో భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. సోమవారం నల్లకుంటలోని నర్మదా భవన్‌లో చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర కార్యాలయంలో 33 జిల్లాల ఈసీ సభ్యుల సమావేశం నిర్వహించారు. సంఘం గౌరవ చైర్మన్‌గా పూర్వ టీఎస్ఎంబీడీసీ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తిని నియమిస్తూ.. తీర్మానం చేశారు. రామానుజ ఫిలాసఫీ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ మాచవరం వెంకటేశ్వర్లు, సంఘం ఉపాధ్యక్షులు తులసీ సత్యనారాయణ, నిర్మల, ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటరమణ, ఆర్థిక కార్యదర్శి కృష్ణస్వామి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ మదన్‌మోహన్, కేశవ్, నరసింహ స్వామి తదితరులు పాల్గొన్నారు.

చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం నూతన కమిటీ..

నల్లకుంట: చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం ఇతర కమిటీ సభ్యుల నియామకాన్ని ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా డాక్టర్ మదన్‌మోహన్, కేశవ్‌కుమార్, అయ్యవారి పాండు, రవికుమార్, గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఉపాధ్యక్షులుగా పర్యాద వెంకటేశ్వర్లు, పుష్పాంజలి, విజయలక్ష్మి, ప్రవీణ్‌కుమార్, వేణుగోపాల్, అశోక్‌కుమార్, సంప్రదాయ కార్యదర్శిగా రాంగోపాల్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ ఉమ్మడి జోనల్ ఉపాధ్యక్షులుగా దాసం కృష్ణ, హరిత జ్యోతిలను నియమించారు.

- సంప్రదాయ మండలిలో 10 మంది అర్చకులు, భవన నిర్మాణ సలహాదారుల మండలిలో 18 మందిని నియమిస్తూ సమావేశం తీర్మానం చేసింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ కొత్తగా నియమితులైన సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.

బస్తీవాసులకు అందుబాటులో ఉంటాం



సీసీరోడ్డును ప్రారంభించిన లాస్య నందిత

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తమ తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న బాటలోనే కట్టుబడి ఉన్నామని లాస్యనందిత, నివేదిత తెలిపారు. రసూల్‌పురా 105 గల్లీలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డును సోమవారం వారు బస్తీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా రోడ్డు వసతి లేక ఇబ్బందులు పడుతుండడంతో తన తండ్రి సాయన్న రూ.25 లక్షలు మంజూరు చేశారని పనులు కాస్తా ఆలస్యం అయినప్పటికీ బస్తీవాసులకు సీసీ రోడ్డు అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందన్నారు. కంటోన్మెంట్ వాసులకు తాము నిరంతరంగా అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్, మార్కెట్ కమిటీ సభ్యులు దేవులపల్లి శ్రీనివాస్, షేక్ నయీం, నరేష్, కుమార్, హరికృష్ణ, సుధాకర్, నవీన్, రేణుక, యాదమ్మ, షాబానా పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సంఘటితంగా పోరాడాలి

లిబర్టీ: హక్కుల సాధనకు ప్రజలు సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీపీఐ నాయకుడు ఎం.మార్టిన్ పేర్కొన్నారు. ఉద్యమాలు, పోరాటాలు చేయకుండా ఏ సమస్యా పరిష్కారం కాదని స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సంఘటితంగా 17 ఏళ్ల పోరాటం ఫలితంగానే సర్వే నెంబర్ 48 భగత్‌సింగ్ నగర్‌లో ప్రజలకు పట్టాలు సాధించుకున్నామని తెలిపారు. వివిధ రూపాల్లో నిర్వహించిన పోరాటం ఫలితంగానే ప్రజలకు శాశ్వత పట్టాలు దక్కాయని గుర్తు చేశారు. 17 ఏళ్లుగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న ప్రజలకు ఎట్టకేలకు ప్రభుత్వం పట్టాలివ్వటం శుభపరిణామం అని అన్నారు. రానున్న రోజుల్లో అదే పోరాట స్ఫూర్తితో సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని మార్టిన్ స్పష్టం చేశారు.

డాక్టర్ బాలరాజు నాయుడుకు కలాం ఎక్స్‌లెన్స్ అవార్డు



డాక్టర్ బాలరాజు నాయుడు తదితరులకు అవార్డులు అందజేసిన నిర్వాహకులు

సైదాబాద్: చంపాపేటలోని ఓనస్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ బాలరాజు నాయుడు ఉత్తమ వైద్యుడి అవార్డ్ అందుకున్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్ అండ్ మెడికల్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్–2023 ప్రదానోత్సవంలో భాగంగా ఈయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. యాక్ట్ నా సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో బాలరాజు నాయుడు ఉత్తమ ఆర్థోపెడిక్ డాక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు సర్వేలో ఉత్తమంగా ఎంపికైన డాక్టర్ బాలరాజు నాయుడు, డాక్టర్ స్వరూప్, డాక్టర్ కార్తీక్‌లకు అవార్డ్‌లు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది ఆయనను అభినందించారు.